5న ఉచిత వైద్యశిబిరం

తిరుపతి టౌన్ : వేమన విజ్ఞాన కేంద్రం ట్రస్టు, మోహన్ డయాబెటిస్ క్లినిక్ చెన్నై వారిచే యశోద నగర్ లోని ఎంబీభవన్ (వేమన ట్రస్ట్ మొదటి అంతస్తులో) 5న సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కార్యదర్శి మల్లారపు నాగార్జున ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. సుగర్ వ్యాధిగ్రస్తులకు అవసరమైన సలహాలు, మందులు ఇస్తారు. ఈ సందర్భంగా పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహిస్తారు. సుగర్ వ్యాధికి సంబంధించిన జాగ్రత్తలు, సుగర్ వ్యాధి ఉందా? లేదా? తెలుసుకోవాలని కోరుకునేవారు ఈ ఉచిత శిబిరానికి హాజరై వివరాలు తెలుసుకోవచ్చు.

'గోరుముద్ద 'లో 'మార్పు'

'వంటమ్మ'ల బకాయిల 'ఓర్పు'

ప్రజాశక్తి- తిరుపతి

ఆర్థికంగా వెనుకబడిన పేద విద్యార్థులు విధిగా బడిలోనే ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ' జగనన్న - గోరుముద్ద' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పౌష్టికాహారాన్ని అందిస్తూ మధ్యాహ్న భోజనం పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకానికి 2020-21 సంవత్సరానికి గాను రాష్ట్రప్రభుత్వం రూ 1,546 కోట్లు కేటాయించింది. అలాగే 2021-22లో 1,797కోట్లు ఖర్చుపెట్టింది. ఈ ఏడాది 2022-23 విద్యాసంవత్సరానికి గాను రూ 1.908 కోట్లు కేటాయించింది. గతంలో ప్రాథమిక తరగతుల్లో (1-5 తరగతులు)ప్రతి విద్యార్థికి రూ 11.26 ఇచ్చేవారు. ప్రాథమికోన్నత తరగతుల విద్యార్థులకు (6-8తరగతులకు) రూ.12.87 ఇస్తుండేవారు. ఉన్నత పాఠశాల (9-10 తగరతులు)లోని ప్రతి విద్యార్థికి రూ.17.52ను ఇచ్చేవారు. అయితే ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఒక్కొక్కరికి రూ 16.07లకు, ప్రాథమికోన్నత విద్యార్థికి 18.75కు, ఉన్నత పాఠశాల విద్యార్థికి రూ.23.40 కి ప్రభుత్వం పెంచింది. అలాగే పాత మెనూ లో పలుమార్పులు చేసి కొత్తమెనును ప్రకటించింది. వీటి అమలుకు ప్రత్యేక నోడల్ అధికారులనూ ఏర్పాటు చేసి తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న 1698 పాఠశాలల్లో 1,60,885 మంది విద్యార్థులకు కొత్త మెనూ అమలును ప్రారంభించారు.

ఇదీ కొత్త మెనూ !

సోమవారం: వేడి పొంగలి, పలావు, గుడ్లు, కూర, చిక్కీ

మంగళవారం: చింతపండు/ నిమ్మకాయ పులిహోర, టమాటా దొండకాయ పచ్చడి, ఉడకబెట్టిన గుడ్డు

బుధవారం: కూరగాయల అన్నం, బంగాళదుంప కుర్మా, ఉడకబె ట్టిన గుడ్డు, చిక్కి

గురువారం: సాంబారు అన్నం, ఉడకబెట్టిన గుడ్డు

శుక్రవారం: అన్నం, ఆకు కూర పప్పు, గుడ్డు, చిక్కి

శనివారం: ఆకుకూరల అన్నం, సాంబారు, తీపి పొంగలి

నెలల తరబడి బకాయిల కోసం వేచి ఉండాల్సిందే..

వాణిశ్రీ స్కీంవర్కర్స్ యూనియన్ నేత

మెనూ లో మార్పు చేసిన ప్రభుత్వం... గ్యాస్, కూరగాయలు లాంటి నిత్యావసరాల ధరల్లో వస్తున్న మార్పులపై ప్రభుత్వం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తోంది. అక్టోబరులో స్వల్పంగా ఛార్జీలను పెంచినా ధరలకు తగ్గట్లు లేవని మధ్యాహ్న భోజన నిర్వాహకులు వాపోతున్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా ఛార్జీలు పెంచాలి. అప్పుడే నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందివ్వడానికి, ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చేందుకు వీలుంటుంది. ఖర్చులు సైతం ఐదారు నెలలకు ఓసారి వేస్తున్నారు.

23,951 మంది రైతుల ఖాతాలకు..

రూ.5.20 కోట్లు జమ : జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి -తిరుపతి బ్యూరో, తిరుపతి టౌన్

రబీ 2020-21 , ఖరీఫ్ 2021 సున్నా వడ్డీ, ఖరీఫ్ 2022 పంట నష్టపరిహారం జిల్లాలో 23,951 మంది రైతులకు రూ.5.20 కోట్లు సోమవారం జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి వై.ఎస్.ఆర్. సున్నా వడ్డీ, పంట రుణాల వడ్డీ రాయితీని అర్హతగల రైతులకు రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు రూ.200 కోట్లను రైతులకు జమ చేసే కార్యక్రమాన్ని చేపట్టగా జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి అద్యక్షులు రఘునాథ రెడ్డి, రైతులు, వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు వీక్షించారు. ముఖ్యమంత్రి రైతుల ఖాతాలకు కంప్యూటర్ బటన్ నొక్కి జమ చేసిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సన్న, చిన్నకారు రైతులు రూ.లక్ష వరకు పంట రుణాలు పొంది, సకాలంలో చెల్లించిన వారికి వడ్డీ రాయితీ మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వం 2019 నుండి అమలు చేసి రైతులను ఆదుకుంటున్నదని , అలాగే ప్రకతి వైపరిత్యాలలో పంట నష్టపోయిన రైతులకు పరిహారంగా ఇన్పుట్ సబ్సిడీ అందిస్తున్నదని అందులో భాగంగా నేడు 23951 మంది రైతుల ఖాతాలకు రూ.5.20 కోట్లు జమ చేశామని అన్నారు. జిల్లాలో రబీ 2020-21 , ఖరీఫ్ 2021 కి సంబందించిన సున్నా వడ్డీ 23,601 మంది రైతులకు రూ.5.01 కోటి , ఇన్పుట్ సబ్సిడీ క్రింద మరో 350 మంది రైతులకు రూ. 19.05 లక్షలు జమ చేశామని అన్నారు. అనంతరం మెగా చెక్కును రైతులకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు పాల్గొన్నారు.

దళితుల సాగు భూమిలో...

పెత్తందారుల 'నిమ్మ'మొక్కలు

ప్రజాశక్తి - బాలాయపల్లి

వాక్యం గ్రామంలో తాము సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలను ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమయ్యింది. ఇంతలోనే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో దళితులకు ఇవ్వాల్సిన భూపంపిణీ కార్యక్రమం ఆగిపోయింది.ఇదే అదునుగా పెత్తందారులకు చెందిన మోతుబరి రైతు అధికార పార్టీ అండ చూసుకుని బెదిరిస్తూ తాము సాగు చేసుకుంటున్న పొలాల్లో నిమ్మచెట్లు వేశారని దళితులు వాపోయారు. తమకు ఎటువంటి జీవనాధారం లేదని, ఆ పొలాలపైనే ఆధారపడి జీవిస్తున్నామని కన్నీరు పెట్టుకున్నారు. ఈ విషయమై మూడు నెలల నుంచి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. తమ భూములను తమకు అప్పగించకపోతే ఆత్మహత్యలే శరణ్యమని కన్నీరు పెట్టుకున్నారు. సోమవారం ఈ మేరకు తహశీల్దార్ దృష్టికి తమ సమస్యను తీసుకెళ్లారు. తహశీల్దార్ మాట్లాడుతూ అక్రమంగా నిమ్మచెట్లు నాటిన వారిపై చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

హాస్టళ్ల సమస్యలపై స్పందించండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఉన్న హాస్టల్ విద్యార్థుల సమస్యలపై స్పందించాలంటూ 'స్పందన' కార్యక్రమంలో జేసికి ఎస్ఎఫ్ఐ తిరుపతి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు భగత్, రవి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఎస్ఎంహెచ్ హాస్టల్ విద్యార్థులు అనేక సమస్యలతో అవస్థలు పడుతున్నారన్నారు. ప్రధానంగా సత్యవేడు, పుత్తూరు, చంద్రగిరి, తిరుపతి సిటిలోని హాస్టల్ విద్యార్థులు సొంత భవనం లేక నరకం చూస్తున్నారని వాపోయారు. మెనూ ప్రకారం చాలా చోట్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంయుక్త కలెక్టర్ స్పందించి వెల్ఫేర్ అధికారులతో మాటాడుతూ త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శివ, తేజ, లోకేష్, వెంకటేష్ నాయక్, సతీష్, లోకేష్, నరేష్, వేణు, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా

అధ్యక్ష కార్యదర్శులుగా రమణయ్య, బాలకృష్ణ

పజాశక్తి - బిఎన్ కండ్రిగ తిరుపతి జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా రమణయ్య, బాలక్రిష్ణ ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభలు బుచ్చినాయుడు కండ్రిగ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో ఆదివారం జరిగింది. 17 మందితో నూతన కమిటీ ఎన్నికయ్యింది. ఏడుగురిని ఆఫీసు బేరర్లుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, రాష్ట్ర కార్యదర్శి వందవాసి నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించి 600 రూపాయలు కూలి పెంచాలని, పేదలకు భూములు పంచాలని, విద్యా వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలని, మద్యాన్ని నియంత్రించాలని, డికెటి భూములను రక్షించాలని, వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం తీసుకురావాలని తీర్మానాలు చేశారు. ఉపాధ్యక్షులుగా వందవాసి నాగరాజు, కలపాటి గురవమ్మ, ముత్యాలయ్య, సహాయ కార్యదర్శులుగా అముదా, రాజగోపాల్ ఎన్నికయ్యారు.

ఆర్కాట్ కృష్ణప్రసాద్‌కు 'రోడ్డు సేఫ్టీ' బాధ్యతలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రాష్ట్రంలో ఒక మహిళచే నడపబడుతున్న 'రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ" తిరుపతి జిల్లా ప్రాంతీయ అధ్యక్షునిగా ఆర్కాట్ కష్ణ ప్రసాద్‌ను నియమించినట్లు ఆ సంస్థ ప్రతినిధి ఆర్.బంగారయ్య తెలిపారు. ఆదివారం స్థానిక తాజ్ హెటల్లో జరిగిన సమావేశంలో నూతన కమిటీ సభ్యులు అందరికి నియామక పత్రాలు అందజేశారు. అనంతరం నూతన అధ్యక్షులు ఆధ్వర్యంలో మోర్త్ రీజనల్ అధికారి యస్. కె. సింగ్ ని కలిసి వారిచేతులు మీదుగా రోడ్డు భద్రతా పోస్టర్లను ఆవిష్కరించారు, రీజినల్ ఆఫీసర్ శ్రవణ్ కుమార్ సింగ్ మాట్లాడుతూ ఈ యొక్క రోడ్డు సేఫ్టీ యన్. జి. ఓ. తో తనకు ఎంతో సాన్నిహిత్యం ఉందని, వారు నిర్వహించిన అనేక రోడ్డు భద్రతా అవగాహనా కార్యక్రమాలలో తనను భాగస్వామ్యం చేశారన్నారు. నూతన అధ్యక్షులు ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర రోడ్డు రహదారి భద్రత కమిటీ రీజినల్ అధికారి ని కలవడం చాలా సంతోషంగా ఉందని, వారి సూచనలు తప్పకుండా పాటిస్తూ "రోడ్డు సేఫ్టీ యన్ జి ఓ" సంస్థ ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే తన అధ్యక్ష నియామకానికి కారణమైన రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్.కె . దుర్గ పద్మజకు కతజ్ఞతలు తెలిపారు.

లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు పంపిణీ : కిలివేటి

సూళ్లూరుపేట : పేదల సొంతింటి కలను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వన్‌టైం సెటిల్మెంట్ పథకాన్ని (ఒటిఎస్)ను ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమానికి జ్యోతి వెలిగించి మహాత్మాజ్యోతిరావు పూలే వర్థంతి సందర్భంగా నివాళులు అర్పించారు. సూళ్లూరుపేట పట్టణ పరిధిలోని సత్యసాయి కల్యాణ మండపంలో సోమవారం సూళ్లూరుపేట పురపాలక పరిధిలోని లబ్ధిదారులకు ఎంఎల్ఎ కిలివేటి సంజీవయ్య ఒటిఎస్ పత్రాలను అందజేశారు. దాదాపు 405 మందికి అందజేశారు. అలాగే ఆరు మండలాలకు సంబంధించిన కొంతమంది రైతులకూ 'భూహక్కు పట్టా' పాస్ పుస్తకాలను అందించారు. ఆర్డీవో రోజ్‌మాండ్, తడ ఎంపిపి రఘురెడ్డి, నాయుడుపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటికం దీపిక పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి : కమిషనర్

తిరుపతి టౌన్ : జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు మరింత వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేసే చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు.వడమాలపెట మండలం కల్లూరులోని జగనన్న లేఔట్ ను సోమవారం ఇంజినీరింగ్, హౌసింగ్ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని, అధికారులు నిత్య పర్యవేక్షణ చేసి పనులు మరింత వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఆయా కాంట్రాక్టర్లకు కేటాయించిన మేరకు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేయించాలన్నారు. అనుకున్న సమయానికి నిర్మాణాలు పూర్తి కాకుంటే సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనర్ వెంట మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి, డి.ఈ. రవీంద్రారెడ్డి ఉన్నారు.

కాంచీపురం పెరుమాళ్ సిల్క్స్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

'పట్టుగుట్టు పెరుమాళ్ కెరుక' అనే నినాదంతో కాంచీపురం వారు తిరుపతిలో నిత్య నూతన కలెక్షన్లతో ఏర్పాటుచేసిన కాంచీపురం పెరుమాళ్ సిల్క్స్ ను కమలానంద భారతి స్వామి , తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. స్థానిక విమల్ రోడ్ లోని ఆ షోరూం వద్ద కమలానంద భారతి స్వామి మాట్లాడుతూ కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో యాజమాన్యం దినదిన అభివద్ధి చెందాలని అక్కడ సిబ్బందికి స్వామివారి ఆశీస్సులు అందించాలన్నారు. నగర ప్రజలు ఈ షో రూమ్ లోని నూతన సరికొత్త డిజైన్లతో కూడిన వస్త్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ కంచి పట్టుచీరలను కంచి రేట్లకే ఇక్కడ అందించడం అభినందనీయమన్నారు. ఇకమీదట పెళ్లి పట్టు చీరల కోసం ఎవరు కంచి వరకు వెళ్ళనవసరం లేదని తిరుపతిలో ప్రారంభించిన కాంచీపురం పెరుమాళ్ సిల్క్స్ ను సందర్శిస్తే చాలు అన్నారు ఇక్కడ అన్ని రకాల వెరైటీలు మహిళలకు అందుబాటులో ఉన్నాయని, దీని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. షోరూం అధినేతలు భయ్యా శ్రీనివాసులు, భయ్యా రవికుమార్ మాట్లాడుతూ పెళ్లి పట్టు చీరల కోసం పెళ్లి వారు ఎన్నో ప్రయాసలతో కంచికి వెళ్లి పట్టుచీరలు అవసరం లేదని, ఇప్పుడు వారికోసం కంచి పట్టు చీరలను కాంచీపురం పెరుమాల్ సిల్క్స్ అతి తక్కువ ధరలకు అందిస్తుందని తెలిపారు. మహిళలకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన ఈ షో రూమ్ లో అన్ని రకాల శారీలు అందుబాటులో ఉన్నాయని మహిళలు దీనిని చేసుకోవాలని అన్నారు . తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ , బిజెపి నాయకులు భాను ప్రకాష్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు నవీన్ కుమార్ రెడ్డి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు మంజునాథ్, పలువురు ప్రముఖులు షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య చికిత్సలు అందించకనే...

దుమ్ముకొట్టుకున్న 'సంచార'వాహనం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

లక్ష్యం ఎలా ఉన్నా... నిర్లక్ష్యం నీరుగారిపోతోంది.. గ్రామ గ్రామాలు తిరుగుతూ ప్రజలకు వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశ్యంతో 'సంచార చికిత్స వాహనాన్ని' ఏర్పాటు చేశారు. అయితే ఏడాదిగా ఈ వాహనం నిరుపయోగంగా మూలనపడి దుమ్ముకొట్టుకుపోయింది. ఈ వాహనం ద్వారా అందించాల్సిన మందులు సైతం 'ఎక్స్‌పైర్' అయిపోయి పనికిరాకుండా పోయాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చికిత్స అందించేందుకు వాహనాన్ని ఏర్పాటు చేసిన అధికారులు, వైద్యులను, సిబ్బందిని ఏర్పాటు చేయకపోవడం గమనార్హం.

పుత్తూరు తహశీల్దార్ కార్యాలయంలో సంచార చికిత్స వాహనం దుమ్ముకొట్టుకుపోయి 'ప్రజాశక్తి' కంట పడింది. ఏడాదిగా వాడకపోవడంతో శిథిలావస్థ దశకు చేరుకుంది. దీనికితోడు వాహనంలో గ్రామీణ ప్రజలకు ఇవ్వాల్సిన మందులు వృథాగా నేలపాలై కనిపిస్తున్నాయి. కొన్ని మందులకు సంబంధించి 'గడువు తేదీ' ఉన్నప్పటికీ నేలపాలు కావడం విమర్శలకు తావిస్తోంది. వైద్యసేవలు అందించాల్సిన వాహనాన్ని మూలన పడేయడం, ఔషధాలను నిరుపయోగంగా చెత్తబుట్టల్లో పడేయడం గమనార్హం. ఇకనైనా జిల్లాస్థాయి వైద్యాధికారులు స్పందించి వాహనాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని స్థానికులు కోరుతున్నారు.

అమ్మవారి బ్రహ్మోత్సవాలు 'సమాప్తం'

పజాశక్తి - తిరుచానూరు

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు జరిగిన కార్తీక బ్రహ్మోత్సవాలు సోమవారం పంచమితీర్థ మహోత్సవంతో ఘనంగా ముగిశాయి. చివరిరోజు ఆలయం వద్ద గల పద్మ పుష్కరిణిలో జరిగిన చక్రస్నానం కార్యక్రమానికి విశేష సంఖ్యలో భక్తులు విచ్చేశారు. జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో టీటీడీ విస్తత ఏర్పాట్లు చేపట్టింది. టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, సివిఎస్‌వో నరసింహ కిషోర్, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, ఎస్వీబీసీ సిఈఓ షణ్ముఖ్ కుమార్ , టీటీడీ చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు

పంచమితీర్థానికి విచ్చేసిన భక్తులకు పోలీసు శాఖ సమన్వయంతో టీటీడీ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. భక్తులు సేద తీరడానికి ఏర్పాటు చేసిన జర్మన్ షెడ్ల నుంచే ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటుచేసి భక్తులను క్రమపద్ధతిలో పుష్కరిణిలోకి అనుమతించారు. పుష్కరిణిలోకి ప్రవేశించేందుకు, తిరిగి వెళ్లేందుకు వేరువేరుగా గేట్లను ఏర్పాటుచేశారు. సివిఎస్‌వో నరసింహ కిషోర్, ఎస్పీ శ్రీ పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్ అధికారులు, పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని పుష్కరిణి వద్ద భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపట్టారు. కాలినడకన వచ్చిన భక్తులకు ఇబ్బందులు లేకుండా తిరుచానూరు బయటి నుంచే వాహనాలను దారి మళ్లించారు. తిరుపతి నుంచి వచ్చే వాహనాలకు, పాడిపేట వైపు నుంచి వచ్చే వాహనాలకు ఆయా ప్రాంతాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టారు. 2500 మంది పోలీసులతోపాటు టీటీడీ భద్రతా సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్, ఎన్.సి.సి విద్యార్థులతో భద్రతా ఏర్పాట్లు చేశారు.

భక్తులకు వైద్యసేవలు

బ్రహ్మోత్సవాలకు విచ్చేసిన భక్తులకు విశేషంగా వైద్యసేవలు అందించారు. అమ్మవారి వాహనం మోసే వాహనబేరర్లకు వైద్యపరంగా తగిన చర్యలు చేపట్టి ఉపశమనం కల్పించారు. టీటీడీ వైద్యులతోపాటు స్విమ్స్, రుయా ఆస్పత్రుల నుంచి వైద్యసిబ్బంది, ఆయుర్వేద వైద్యులు సేవలందించారు. తోళప్పగార్డెన్‌లో ఉన్న డిస్పెన్సరీతోపాటు అదనంగా డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది అందుబాటులో ఉన్నారు. 6 అంబులెన్సులతోపాటు శుక్రవారపుతోట పద్మపుష్కరిణి వద్ద ప్రథమచికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు.

శ్రీవారి ఆలయం నుండి సారె

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన సోమవారం పంచమితీర్థం ఉత్సవాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయం నుంచి సారె సమర్పించారు. ప్రతి ఏటా పంచమితీర్థం రోజున తిరుమల నుంచి సారె తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తోంది. శ్రీవారి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి పాల్గొన్నారు. ఆభరణంతో కూడిన శ్రీవారి సారెను అలిపిరి వద్ద ఈవో ఎవి.ధర్మారెడ్డి జెఈవో వీరబ్రహ్మానికి అందజేశారు.

విజయవంతంగా అమ్మవారి పంచమితీర్థం : ఛైర్మన్

తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన పంచమితీర్థం కార్యక్రమం భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించామని టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి చెప్పారు. మీడియాతో మాట్లాడారు. నవంబరు 20వ తేదీ శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. సోమవారం పంచమితీర్థం కార్యక్రమంలో లక్ష మందికి పైగా భక్తులు హాజరై పుణ్య స్నానాలు చేశారన్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేశామన్నారు. తిరుపతి చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు తమిళనాడు నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆదివారం రాత్రికే తిరుచానూరు చేరుకున్నారని ఛైర్మన్ తెలిపారు. కరోనా కారణంగా రెండేళ్ళ తరువాత పంచమితీర్థం పుష్కరిణిలో చేస్తున్నందువల్ల పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారని టీటీడీ యాజమాన్యం ముందుగానే అంచనా వేసిందన్నారు. ఇందులో భాగంగానే మూడు తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసి అందులో భక్తులు సేద తీరడంతో పాటు వారికి ఆదివారం రాత్రి నుంచే అన్నప్రసాదాలు, కాఫీ, టీ, పాలు, తాగునీరు అందించామని ఆయన వివరించారు.

భక్తులకు సర్పంచి రామచంద్రారెడ్డి అన్నదానం

శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో చివరి ఘట్టమైన పంచమి తీర్థానికి విచ్చేసే భక్తులకు తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ అమ్మవారి భక్తులకు ప్రతి సంవత్సరం అన్నదాన కార్యక్రమం చేయడం ఆనవాయితీగా వస్తుందని, స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సహకారంతో ఇలాంటి బహత్తర కార్యక్రమాన్ని దిగ్విజయంగా జరుపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సతీమణి మధు రెడ్డి మంజులరెడ్డి, ధనుష్ రెడ్డి, ఎంపీటీసీలు నరేష్ రెడ్డి, శేఖర్ రెడ్డి ,వార్డ్ నెంబర్లు మునీంద్ర రాయల్ , ముళ్లపూడి సర్పంచ్ సూరి, ఎక్స్ సర్పంచ్ వెంకటరమణ, రాజేంద్ర, నాయక్, బ్రాహ్మణ పట్టు ఎంపీటీసీ యోగానంద రెడ్డి , మార్కెట్ యార్డ్ చైర్మెన్ విద్యా గణపతి నాయుడు, ఆర్.ఆర్. యూత్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

సంగీత, నృత్య కళాశాలలో ..

దరఖాస్తు గడువు పొడిగింపు

ప్రజాశక్తి - క్యాంపస్ : తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వేంకటేశ్వర సంగీత, నృత్య కళాశాలలో చేరుటకు నవంబరు 30 వరకు అడ్మిషన్లు పొడిగించడం జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ సాయంత్రం కళాశాల పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం డిప్లమా, సర్టిఫికెట్ కోర్స్ ఉత్తీర్ణులైన వారికి ఎస్వి యూనివర్సిటీ పరిధిలో ఉన్న రెగ్యులర్ విశారద, ప్రవీణ కోర్సులలో చేరవచ్చునని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 8వ తరగతి ఉత్తీర్ణులై 14 సంవత్సరాలు వయసు నిండిన ప్రతి ఒక్కరూ చేరవచ్చునని వెల్లడించారు. ఫీజు ఒక సంవత్సరానికి రూ. 3,025లు మాత్రమే, ఉచిత వసతి, భోజన సదుపాయం కలదన్నారు. విద్యార్థులు ఒరిజినల్ టిసి, ఇతర సర్టిఫికెట్లు జిరాక్స్ చేసుకొనిరాగలరన్నారు. ఆన్లైన్ పద్ధతి లేదు. ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు. 9491599995 / 087722 64597 సంప్రదించాలన్నారు.

నాడు -నేడు పనులు తనిఖీ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రూరల్ మండలంలోని వేపగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులను జిల్లా విద్యాశాఖ అధికారి వి.శేఖర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల భవన నిర్మాణ పనులు నాణ్యంగా అతిత్వరగా పూర్తిచేసి విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులను సబ్జెక్టు ప్రకారంగా సక్రమమైన విద్యను అందిస్తున్నారాని అడిగి తెలుసుకున్నారు. అలాగే మధ్యాహ్నం భోజనం తగినంత పంపిణీ చేస్తున్నారా లేదా, మధ్యాహ్నం విద్యా ర్థులకు కోడిగుడ్లు ఇస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

ప్రైవేటు రంగంలో...

ట్యాలీ ప్రైమ్‌కోర్సుకు డిమాండ్

ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ట్యాలీ ప్రైమ్ కోర్సుకు ప్రైవేటు రంగంలో చాలా డిమాండ్ ఉందని పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం పట్టణంలోని గురుకృప ఐటి ట్రైనింగ్ సెంటర్ తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ప్రస్తుతం ట్యాలీ ప్రైమ్ కోర్సుకు అవగాహన నిర్వహించారు. ఏ.దేవిక, వాసవి, జి.తిరుమలయ్య. ఎం రెడ్డి నాయక్, రంగయ్య, ఎం.శ్రీనివాసులు, ట్యాలీ ట్రైనర్ హరిహరన్ పాల్గొన్నారు.

బాలికలకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు పట్టణ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మనుబోలు గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో రొటేరియన్ పి.నిరంజన్ రెడ్డి జన్మదినం సందర్భంగా వారి దాతృత్వం తో బాలికలకు డాన్స్ లెగ్గిన్స్ బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన, వక్తృత్వపు, వ్యాసరచనా పోటీలలో గెలుపొందిన బాలికలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు కిరణ్ చక్రవర్తి, సీనియర్ రోటేరియన్స్, దశరధరామిరెడ్డి, పి.వి.కృష్ణయ్య, యన్.బాలకృష్ణం రాజు, పి.నిరంజన్ రెడ్డి, కలికి జనార్ధన రెడ్డి, బి.వి.శ్రీధర్ రెడ్డి, వై.ప్రభాకర రెడ్డి, యం.సి.మల్లయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉదయగిరి నియోజకవర్గ పరిశీలకులుగా

కొడవలూరు ధనంజయ రెడ్డి నియామకం

ప్రజాశక్తి - కోట: ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజక వర్గం పరిశీలకులుగా కొడవలూరు ధనంజ య రెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా కొడవలూరు ధనంజయ రెడ్డి మాట్లాడుతూ తమను గుర్తించి ఉదయగిరి నియోజకవర్గం పరిశీలకునిగా నియమించడం సంతోషదాయకమని అన్నారు. ఈ మేరకు వైసీపీ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, వైసీపీ రాజకీయ సలహాదారులు సజ్జల రామకృష్ణా రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కోట మండలంలోని సీనియర్ వైసీపీ నాయకులు చేవూరు. నాగేశ్వరావు, చిట్టేడు నారాయణ, కొడవలూరు ధనంజయ రెడ్డి అభిమానులు సంతోషం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

వైసీపీ యూత్ నాయకుడికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పుత్తూరు మండలం కేబీఆర్‌పురంకు చెందిన వైసీపీ యూత్ నాయకుడు అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతి స్విమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ డిశ్చార్జ్ అయ్యి ఇంటికి చేరుకున్నాడు. పార్టీ కోసం పనిచేస్తున్న ఆ యువకుడి అనారోగ్యాన్ని గుర్తించి ఆదివారం మంత్రి ఆర్కే రోజా సోదరులు రాంప్రసాద్ రెడ్డి గ్రామానికి చేరుకుని అతడిని పరామర్శించారు. రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.25 వేలు ఆర్థిక సాయం అందించారు. ఎబినేసర్ కుటుంబ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ రాష్ట్ర నాయకులు శ్యామ్ లాల్, ఏఎంసీ డైరెక్టర్ వడివేలు, అన్నా లోకనాథం పాల్గొన్నారు.

కొణతం సురేష్ కుటుంబానికి...

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గత సంవత్సరం మృతి చెందిన టిడిపి ఎస్సీ సెల్ పట్టణ కన్వీనర్ కొణతం సురేష్ కుటుంబ సభ్యులకు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పార్టీ తరపున రూ.2లక్షల 46 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం సురేష్ ఎంతో అంకితభావంతో పనిచేశారని అకస్మాత్తుగా గుండెపోటుతో మృతి చెందడం చాలా బాధాకరమని అన్నారు. మృతి చెందిన తర్వాత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వారి కుటుంబ సభ్యులను వారింటికెళ్ళి పరామర్శించారని గుర్తు చేశారు.

పద్మావతిలో కేంద్ర ప్రభుత్వ విత్త విధానాలపై చర్చ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం లోని మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ విత్త విధానాలపై చర్చ అనే అంశం పై న్యాయ విభాగంలోని విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్రం లెక్చరర్ డాక్టర్ కే.రాణి మాట్లాడుతూ దేశ పౌరునిగా దేశ ఆర్థిక అంశాలపైన సంపూర్ణమైన అవగాహన కలిగి ఉండాలని తద్వారా ఆర్థిక అభివృద్ధి కోసం భాగస్వామ్యంతో తమ వంతు కృషి చేయాలని సూచించారు. న్యాయ విభాగాధిపతి ఆచార్య మాధురి పరదేశి, ఉమెన్స్ స్టడీ సెంటర్ ప్రీతి, విద్యార్థినులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ రెడ్డిని అరెస్టు చేయాలి: సింధూజ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడుని, టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను చంపుతామని బరితెగించి మాట్లాడిన వైసీపీ ఎమ్మెల్యేతో పుదుర్తి ప్రకాశ్ రెడ్డి తమ్ముడు చంద్రశేఖర్ రెడ్డిని వెంటనే అరెస్టు చేయాలని టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబూరు సింధూజ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. చంద్రశేఖర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టిడిపి నాయకులు శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తే పోలీసులు వారిపై కుట్రపూరితంగా వ్యవహరిస్తూ లాటి జులిపించడం ఏంటని ప్రశ్నించారు. చంద్రశేఖర్ రెడ్డిని అరెస్టు చేయకపోతే రాష్ట్రంలో జరిగే పరిణామాలకు సీఎం జగన్మోహన్ రెడ్డి బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

సందుల్లో పందులు..

- నివాసాల మధ్య విచ్చలవిడిగా స్వైరవిహారం
- ఆందోళనలో గ్రామస్తులు

వీధుల్లో సంచరిస్తున్న పందులు

ప్రజాశక్తి - ఓజిలి : మండల కేంద్రంలోని గ్రామ వీధుల్లో గుంపులు గుంపులుగా పందులు స్వైర విహారం చేస్తున్నాయి. నివాసాల మధ్య విచ్చల విడిగా సంచరించడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. పందుల పెంపకం దారులు గ్రామ వీధుల్లో నివాసాలు మధ్య వదిలి ప్రజలను ముప్పు తిప్పలు పెడుతున్నారు. ఇవి మురుగునీటి గుంటలు, చెత్తకుప్పలను ఆవాసాలకు చేసుకునే సంచరిస్తున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. నివాస ప్రాంతాల్లో పందుల సంచారాన్ని నియంత్రించాలని స్థానిక అధికారులకు, పాలకులకు విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ చర్యలు తీసుకోవడంలేదని వాపోతున్నారు. పందుల పెంపకందారులకు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పందుల కారణంగా అనేక వ్యాధులు సోకే ప్రమాదం లేకపోలేదని ముఖ్యంగా మెదడు వాపు ఇది చిన్నపిల్లల్లో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితికి దారితీస్తుంది. అలాగే పందుల కార ణంగా ఇన్‌ఫ్లూయెంజ వైరస్ సంక్ర మించే అవకాశం ఉందని, ఇది ఊపిరితిత్తుల పనితీరును దెబ్బతీస్తుందిని దీనివల్ల దగ్గు, జలుబు, జ్వరం దీర్ఘకాలిక సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. గ్రామ వీధుల్లో చిన్నపిల్లలు ఆటాడుకుంటున్న సమయంలో వారిపై తిరగ పడుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. పందులు పిల్లలతో సహా ఇంటి పరిసరాలలో సంచరిస్తూ ఇంటి పరిసరాల్లో అపరిశుభ్రత వాతావరణం కలిగిస్తున్నాయని, వీటి వల్ల వచ్చే దుర్వాసన తట్టుకోలేక పోతున్నామని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందుల బెడద నుంచి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పెంపకం దారులపై చర్యలు తీసుకుంటాం

గ్రామ నివాసాల మధ్య పందులను వదిలి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే సహించేది లేదని పందుల పెంపకం దారులపై చర్యలు చేపడుతాము. పెంపకం దారులను పిలిపించి నోటీసులు జారీ చేస్తాం. లేనిపక్షంలో తదుపరి చర్యలు తీసుకుంటాం.

–ఎంపీడీవో రజినీకాంత్

ఎన్నికల హడావిడి మొదలయ్యిందా..?

జిల్లాలో అధికార, ప్రతిపక్షాల సమీకరణలు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ఎన్నికలకు మరో ఏడాదిన్నర కాలం గడువు ఉన్నప్పటికీ జిల్లాలో ఎన్నికల హడావిడి మొదలయ్యింది. అధికార ప్రతిపక్ష పార్టీలు నియోజకవర్గాల్లో గెలుపు గుర్రాలను అన్వేషిస్తున్నారు. ఇప్పటికే టిడిపిలో ఎనిమిది నియోజక వర్గాల్లో అభ్యర్థులను ప్రకటించుకుంది. నాలుగు నియోజకవర్గాలు మినహా మిగతా అన్ని నియోజక వర్గాల్లో పాతవారే ఉంటారని జగన్ ఇప్పటికే వెల్లడించారు. వారసులను తెరపైకి తీసుకొస్తున్న నేపథ్యంలో 2024 ఎన్నికల్లో పాతవారే నిలబడాలని రాజకీయ వారసులు ప్రస్తుతానికి వద్దని సూచన చేసినట్లు తెలుస్తోంది. జనసేన పార్టీ టిడిపితో పొత్తు కుదుర్చుకుంటే తిరుపతి, మదనపల్లి సీటును వదులుకోవాల్సి రావచ్చు. బిజెపితోనూ అవగాహన ఉంటే తిరుపతి ఎంపి స్థానం టిడిపి కోల్పోవాల్సి ఉండొచ్చు. టిడిపి ఇప్పటివరకూ కుప్పంలో నారా చంద్రబాబునాయుడు, చంద్రగిరి పులివర్తి నాని, పలమనేరు మాజీ మంత్రి అమరనాథరెడ్డి, సత్యవేడు హేమలత, శ్రీకాళహస్తి బొజ్జల సుధీర్, నగరి గాలి భానుప్రకాష్, పీలేరు నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్లను అధికారికంగా ప్రకటించింది. మదనపల్లి, తిరుపతిలలో పొత్తు నేపథ్యంలో ఖాళీగా ఉంచింది. మిగిలిన చిత్తూరు, జీడీనెల్లూరు, తంబళ్లపల్లి, పుంగనూరు నియోజక వర్గాల్లో అభ్యర్థులను ప్రకటించ కుండా పెండింగ్‌లో ఉంచింది. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ సంబంధించి పూతలపట్టు, పలమనేరు, మదనపల్లి నియోజక వర్గాల్లో అభ్యర్థుల మార్పు ఉండొచ్చని సంకేతాలు ఉన్నాయి. అయితే మదనపల్లి స్థానిక ఎంఎల్‌ఎపై వ్యతిరేకత ఉందని సర్వేలో తేలడంతో మాజీ ఎంఎల్‌సి నరేష్‌కుమార్‌రెడ్డికి అవకాశం ఇవ్వనున్న నేపథ్యంలో ఇటీవలే టిడిపికి రాజీనామా చేయనున్నారు. మిగిలిన అన్ని చోట్ల సిట్టింగులకే స్థానం పదిలం కానుంది. 2019 ఎన్నికల్లో గెలిచిన తిరుపతి ఎంఎల్‌ఎ భూమన కరుణాకరరెడ్డి బహిరంగ సభ పెట్టి 'తన వారసునికి అవకాశం ఇవ్వాలి' అని శ్రేణులకు తెలిపారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సైతం తన కుమారుని బరిలో దింపాలని నియోజకవర్గంలో మహా పాదయాత్రను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో జగన్ 'ఈ ఎన్నికల్లో వారసులు పోటీకి వద్దని' చెప్పడంతో తండ్రులే పోటీ చేసే అవకాశం కనిపిస్తోంది. ఏదిఏమైనా జిల్లాలో ఎన్నికల హడావిడి గత ఆరు నెలలుగా కనిపిస్తూనేఉంది.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే



శ్రీకాళహస్తిలో..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే అని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కొనియాడారు. స్థానిక వైసీపీ క్యాంపు కార్యాలయంలో సోమవారం పూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, మహిళా సాధికారత కోసం పూలే చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పాకాల: ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం యూనిట్ అధ్యక్షుడు మునస్వామి ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో పూలేవర్ధంతి సభను నిర్వహించారు.

చిన్నగొట్టిగల్లు: ఏపీ యమ్మార్పియస్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు గురుశంకర ప్రసాద్ ఆధ్వర్యంలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి కార్యకర్తలతో కలిసి నివాళులర్పించారు.

గూడూరు : పట్టణంలోని ప్రధాన పోస్ట్ ఆఫీస్ ముందు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఎంఎల్‌టి ప్రసాద్ ఆధ్వర్యంలో బీసీ నాయకులు బొమ్మిడి శ్రీనివాసులు, భాస్కర్ గౌడ్, భక్తిని విజయ్‌కుమార్ నివాళులు అర్పించారు.

నాయుడుపేట: మండలంలోని పలు కార్యాలయాల్లో పలువురు నాయకులు, అధికారులు మహాత్మా జ్యోతిరావు పూలే, ఆయన సతీమణి సావిత్రి బాయి పూలే చిత్ర పటలకు నివాళులర్పించారు. నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలోని వారి విగ్రహాలకు పూల మాలలు వేసి ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. మునిసిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్సార్సీపీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

క్యాంపస్ : రాయలసీమ బీసీ విద్యార్థి విభాగం అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ ఆధ్వర్యంలో బాలాజీ కాలనీలోని పూలే విగ్రహానికి ఘన నివాళులర్పించారు.

పెళ్లకూరు :మండలంలోని పెళ్లకూరు మండల అభివృద్ధి కార్యాలయంలో మండల ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్ రెడ్డి, మహాత్మా జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

గూడూరు రూరల్: గూడూరు రెవెన్యూ డివిజన్ అధికారి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గూడూరు సబ్ కలెక్టర్ వారి కార్యా లయంలో జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఆర్డీవో, కార్యాలయ అధికారులు, సిబ్బంది, రెవె న్యూశాఖ అధికా రులతో కలిసి పూల మాలలు వేసి నివాళు లర్పించారు.

శ్రీకాళహస్తి రూరల్‌లో..

తిరుపతి టౌన్: సామాజిక న్యాయం కోసం, మహిళా అభ్యున్నతికి పోరాడిన తత్వవేత్త, విద్యావేత్త మహాత్మా జ్యోతిరావు పూలే అని మేయర్ డాక్టర్ శిరీష అన్నారు. తిరుపతి బాలాజీ కాలనీ సర్కిల్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి బిసి సంఘర్షణ సమితి నిర్వహణ కమిటి సభ్యులతో కలిసి సోమవారం నివాళి అర్పించారు.

కోట: మండలంలోని స్థానిక కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు దాసరి అంజమ్మ, జెడ్పీటీసీ సభ్యులు దాసరి కోటయ్య మండల ప్రజాపరిషత్, కోట ఎంపిడిఓ భవాని ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని స్థానిక టీ.ఎం.వీ కండ్రిగ పంచాయతీలో వడ్ల తంగళ్ బాలాజీ ప్రసాద్ రెడ్డి నివాసంలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ బీ.సీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్లతంగల్ బాలాజీ ప్రసాద్ రెడ్డి పాల్గొని శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసన సభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి సహకారంతో త్వరలోనే శ్రీకాళహస్తి పట్టణంలో జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని తెలిపారు.

గూడూరు ఆర్డీవో ఆధ్వర్యంలో..

యువజనోత్సవాలలో సంగీత కళాశాల ప్రతిభ

ప్రజాశక్తి-క్యాంపస్, తిరుపతి మంగళం : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పరిధి లోని అంతర్ కళాశాల యూత్ ఫెస్టివల్ కార్య క్రమంలో శ్రీవెంక టేశ్వర సంగీతం నృత్య కళాశాల విద్యార్థులు అత్యధిక బహుమతులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచారు. స్టూడెంట్ కల్చరల్ అఫైర్స్ డైరెక్టర్ ఆచార్య బీవీ.మురళీధర్ మాట్లాడుతూ ఇందులో విజేతలుగా నిలిచిన వారు దక్షిణాది రాష్ట్రాల యూత్ ఫెస్టివల్‌లో పాల్గొంటారని అన్నారు. గ్రూప్ సాంగ్స్ ఇండియన్ విభాగంలో తిరుపతి ఎమరాల్డ్ కళాశాల విద్యార్థులు మొదటి స్థానాన్ని, తిరుపతి ఎస్వీయూ మ్యూజిక్ కళాశాల విద్యార్థులు, రెండవ స్థానాన్ని వెదురుకుప్పం చెందిన వైఎస్‌ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మూడో స్థానాన్ని కైవసం చేసుకున్నారు. గ్రూప్ సాంగ్ వెస్ట్రన్ విభాగంలో తిరుపతి ఎమరాల్డ్ కళాశాల మొదటి స్థానం, మదనపల్లి శ్రీనివాస డిగ్రీ కళాశాల రెండవ స్థానం, ఎమరాల్డ్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల మూడో స్థానాన్ని దక్కించుకున్నాయి. జానపద బృంద నృత్య విభాగంలో ఎస్వియు కాలేజ్ ఆఫ్ సైన్సెస్ విద్యా ర్థులు మొదటి స్థానాన్ని, మదనపల్లి జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల రెండవ స్థానాన్ని, తిరుపతి ఎమరాల్డ్ డిగ్రీ కళాశాల మూడవ స్థానాన్ని స్థానంలో నిలిచాయి. క్విజ్ పోటీలలో ఎస్వి ఆర్ట్స్ కళాశాల మొదటి స్థానం, ఎస్వీయూ ఆర్ట్స్ కళాశాల రెండవ స్థానం, నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. బృంద చర్చలు డిబేట్ ప్రోగ్రాంలో ఎమరాల్డ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మొదటి స్థానం, మదనపల్లి శ్రీనివాస డిగ్రీ కళాశాల విద్యార్థులు రెండవ స్థానం, ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థులు మూడవ స్థానంలో నిలిచారు. సంగీత పోటీలలో అత్యధిక బహుమతులను ఎస్వి మ్యూజిక్ కళాశాల విద్యార్థులు దక్కించుకోవడం జరిగింది. బృందాలు, సోలో విభాగంలో మొత్తం 240 మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలను జ్ఞాపకాలను సాంస్కృతిక విభాగం డైరెక్టర్ ఆచార్య బివి మురళీధర్, సాంస్కృతిక విభాగం కో–ఆర్డినేటర్ డాక్టర్ కడియాల వెంకటరమణలు అందజేశారు.

లింగ వివక్ష అసమానతలను తొలగించాలి

జెడ్పిటిసి విజయలక్ష్మి

ప్రజాశక్తి -సత్యవేడు: సమాజంలో లింగ వివక్షత అసమానతలను తొలగించాల్సిన అవసరం ఉందని తిరుపతి జిల్లా సత్యవేడు జెడ్పిటిసి విజయలక్ష్మి చెప్పారు. సోమవారం లింగ వివక్షత నిర్మూలనపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ సుశీల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా సింగల్ విండో అధ్యక్షులు నిరంజన్ రెడ్డి, వైసీపీ జిల్లా కార్మిక శాఖ అధ్యక్షులు బిరేంద్ర వర్మ, బెల్ట్ రమేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పిటిసి విజయలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో బాలికల పట్ల వివక్షత తగదన్నారు. ఎంపీపీ ప్రతిమసుశీల్ కుమార్ రెడ్డి లింగ వివక్షత నిర్మూలనపై అంగన్వాడి కార్యకర్తలు, మహిళా సర్పంచులు, డ్వాక్రా మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ గాంధీ విగ్రహం వరకు కొనసాగింది. కళాజాత బృందం ఎయిడ్స్‌పై పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఎంపీడీవో విజయ్ కుమారి, వైఎస్‌ఆర్ క్రాంతి పదం ఏపిఎం స్వర్ణలత,ఐసిడిఎస్ అధికారిని దేవకుమారి, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యురాలు మస్తానమ్మ, ఎంపీటీసీలు సరవన,మోహన్ రెడ్డి, సర్పంచులు శేఖర్, మధుసూదన్ రావు, నాగమ్మ శ్రీరాములు రెడ్డి, జయ, వైసీపీ నేతలు టెంకాయల కిష్టయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో రాష్ట్ర మంత్రులు

ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. సోమవారం ఉదయం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో రాష్ట్ర మంత్రులు విశ్వరూప్, దాడిచెట్టి రాజా,ప్రభుత్వ విప్ కోరముట్ల శ్రీనివాస్ లు స్వామివారి సేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు.

పూడిలో క్షుద్ర పూజల కలకలం

ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని పూడి గ్రామ పరిధిలోని జూగుంట చెరువులో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించడం కలకలం రేపింది. జూగుంట చెరువులో క్షుద్ర పూజలు జరిపినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు వాహనాల్లో వచ్చి రాత్రి వేళ ఈ పూజలు చేసి ఉంటారని గ్రామస్తులు అంటున్నారు. కాగా పూడి గ్రామంలో ఒక వ్యక్తి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని... ఈయన ఆధ్వర్యంలో పూజలు చేసి ఉండవచ్చని మరికొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై తొట్టంబేడు పోలీసులు కూడా ఆరా తీస్తున్నారు. పోలీసుల విచారణలో వాస్తవాలు తేలే అవకాశం ఉంది.

శిల్ప గురు' వేలాయుధం

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి: ప్రతిష్టాత్మక 'శిల్ప గురు' జాతీయ అవార్డును పట్టణానికి చెందిన ప్రముఖ కలంకారీ కళాకారుడు వేలాయుధం శ్రీనివాసులు రెడ్డి అందుకున్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో సోమవారం కేంద్ర జౌళీ మంత్రిత్వ శాఖ నిర్వహించిన బహు మతుల ప్రధానోత్సవంలో వేలాయుధం శిల్ప గురు అవార్డును భారత ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా అందుకున్నారు. శ్రీ చక్రంలోని దేవతా మూర్తుల రూపాలను కలంకారి చిత్రంపై లిఖించినందుకు గాను భారత ప్రభుత్వం ఆయన్ను 'శిల్ప గురు' అవార్డుతో సన్మానించింది.

కలంకారీ శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కలంకారీ వృత్తి నైపుణ్య శిక్షణా తరగతులను గాయత్రి ఎడ్యుకేషనల్ సొసైటీ, డీసీ హ్యాండీక్రాఫ్ట్ సౌజన్యంతో సోమవారం ప్రారంభించారు. హ్యాండీక్రాఫ్ట్ తిరుపతి పిఒ నీతా శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. శ్రీకాళహస్తి ప్రాంత కలంకారి కళాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నేషనల్ అవార్డు గ్రహీత విశ్వనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫయిర్ విరాళం

ప్రజాశక్తి -తొట్టంబేడు: మండలంలోని కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సోమవారం మామిడిగుంటకు చెందిన మామిడి వినోద్ రూ.15వేల విలువజేసే వాటర్ ప్యూరిఫయిర్ విరాళంగా ఇచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ఈ వాటర్ ప్యూరిఫయర్‌ను స్వీకరించారు. న్యాయవాది భక్తవత్సల నాయుడు, ఢిల్లీ బాబు, అరుణ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: భారత రాజ్యాంగ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా శ్రీకాళహస్తి మండల న్యాయ సేవా అధికార సంఘం ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని పానగల్ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు 'రాజ్యాంగం– ప్రాథమిక హక్కులు' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు పారా లీగల్ వాలంటీర్లు యాసిన్, బాలసుబ్రమణ్యం తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట కృష్ణ పాల్గొన్నారు.

చక్రాల ఉషా జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టిడిపి మహిళా విభాగం తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షురాలు చక్రాల ఉషా జన్మదిన వేడుకలు సోమవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. స్థానిక ఎన్టీఆర్ భవన్లో నియోజవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్, తిరుపతిపార్లమెంట్ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. రాష్ట్ర కార్యదర్శి రెడ్డి వారి గురువారెడ్డి, పట్టణ అధ్యక్షు విజయ్ కుమార్, కామేష్ యాదవ్ పాల్గొన్నారు.

'నుడ' ఛైర్మన్‌ను కలిసిన చిల్లకూరు సాయిప్రసాద్ రెడ్డి

ప్రజాశక్తి-కోట: ప్రముఖ వైసీపీ నాయకులు, నెల్లూరు నుడ ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్‌ను గూడూరు నియోజకవర్గ వైసీపీ పరిశీలకులుగా నియమిస్తూ రాష్ట్ర వైసీపీ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా, కోట మండలం, చెందోడు గ్రామానికి చెందిన గూడూరు నియోజకవర్గ వైసీపీ యువత అధ్యక్షుడు చిల్లకూరు సాయిప్రసాద్ రెడ్డి సోమవారం నెల్లూరులోని నుడ కార్యాల యంలో ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించి పుష్ప గుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు

క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-గూడూరు రూరల్: పాలిచర్లవారిపాలెం సమీపంలో రాత్రి 11:00 గం"సమయంలో రహదారి పక్కన బైక్‌తో సహా యువకుడు కొన ఊపిరితో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి 108 వాహనానికి సమాచారం అందించారు. గాయపడిన యువకుడిని గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం అందించేలోగా మరణించాడు. చనిపోయిన వ్యక్తి చింతవరం గ్రామానికి చెందిన ఎం.సాయి కుమార్‌గా పోలీసులు గుర్తించారు. ఇతను గూడూరులోని ఓ మొబైల్ షాప్‌లో పనిచేస్తున్నట్లు, పని ముగించుకుని చింతవరంకు వెళ్లే క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఏదైనా వాహనం ఇతన్ని ఢీకొట్టిందా.. లేక అదుపుతప్పి బైక్ పైనుంచి పడిపోయాడా అనే కోణంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్లైన్ మోసానికి పాల్పడిన..

ఘటనపై కేసు నమోదు : సీఐ రాజశేఖర్

ప్రజాశక్తి-పాకాల: ఆన్లైన్ మోసానికి పాల్పడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పాకాల సీఐ రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన కథనం మేరకు.. చంద్రగిరి వారి పల్లెకు చెందిన ఢిల్లీ ప్రసాద్ రెడ్డి అనే వ్యక్తి వాట్సాప్‌కు పార్ట్ టైం జాబ్ పేరుతో ఒక సందేశం రాగా ఆ సందేశం పంపిన వ్యక్తుల సూచనలు మేరకు రూ.100 నుండి సుమారు రూ.2 లక్షల 50 వేల వరకు ఆన్లైన్ ద్వారా ప్రొడక్టుల కొనుగోలు అమ్మకాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో రూ.4 లక్షల 50 వేలు ఢిల్లీ ప్రసాద్ ఖాతాలోకి నగదు రాగా ఆ నగదు మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవాలి అనుకున్న సమయంలో విత్ డ్రా చేసుకొని ఇవ్వకుండా ఖాతాను లాక్ చేశారని అన్నారు. దీంతోపాటు ప్రోడక్ట్‌కు సంబంధించిన వస్తువులకు పన్ను రూ.74,351లు కట్టాలని ఒత్తిడి తెచ్చారన్నారు. దీంతో బాధితుడు ఢిల్లీ ప్రసాద్ పూర్తి మొత్తాన్ని నష్టపోయానని, మోసపోయానని గ్రహించి పాకాల పోలీస్ స్టేషన్ లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. అలాగే ప్రతి ఒక్కరూ వాట్సాప్‌లోను మామూలు మెసేజుల్లో వచ్చే లింకుల మీద క్లిక్ చేసి వాళ్ళు చెప్పే మాటలు నమ్మి సైబర్‌నేరాల బారినపడద్దని తగుజాగ్రత్తలు తీసుకోవాలని సిఐ తెలిపారు.

షికారీల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి -రేణిగుంట: మండలంలోని తుకివాకం పంచాయతీలో ఏఎన్‌ఆర్ కాలనీలో సోమవారం శునకాలు పట్టే విషయంలో రెండు గ్రూపుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘర్షణలో ఇరుగ్రూపుల వారు కొట్టుకోవడంతో కొంతమందికి గాయాలయ్యాయి. దీంతో వారు గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు. దీంతో ఇన్‌ఛార్జి సీఐ సుబ్బారెడ్డి వారిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేశారు.

'వెలుగు' దొంగలను విధుల నుంచి తొలగించాలి

వామపక్ష నాయకులు

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: మండలంలో వెలుగు, డ్వాక్రా, సంఘాలలో బినామి గ్రూపులు సృష్టించి, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, డిసిసి బ్యాంకులలో సుమారు రూ.మూడు కోట్ల వరకు అక్రమంగా రుణాలు పొందిన ఏపిఎం జ్యోతిని, సంఘమిత్రలు, సీసీలను వెంటనే తొలగించాలని, కలెక్టర్ ఆఫీస్ వద్ద సోమవారం ధర్నా చేపట్టారు. వారికి సంఘీభావంగా సిపిఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి ఆంబాకం చిన్నిరాజ్, సిపిఎం సత్యవేడు నియోజకవర్గ ఇన్చార్జి దాసరి జనార్ధన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం బుచ్చినాయుడు కండ్రిగ మండల కార్యదర్శి ఎం.ధనుంజయులు, నాగలాపురం మండల సిపిఎం కార్యదర్శి మురుగేషన్, మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా బాలమురళి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ వీఆర్వోల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎం.బాల మురళీకృష్ణ ఎన్నికయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా విఆర్వోల సంఘం అధ్యక్షుడు బాలాజీ రెడ్డి ఆధ్వర్యం లో సోమవారం శ్రీకాళహస్తి రెవెన్యూ డివిజన్ వీఆర్వోల సంఘం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షుడిగా ఎం.బాలమురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా తేజశ్రీ, మనోహర్, అసోసియేషన్ గౌరవాధ్యక్షులుగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా తేజస్వి, పూర్ణిమ, మనోహర్, కార్యదర్శిగా చంద్ర శేఖర్, సంయుక్త కార్యదర్శులుగా రవి, మువర్ణ, ఝాన్సీరాణి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా శివ ప్రసాద్, మణి, శివకుమార్, కోశాధికారిగా సాయి కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా నాగరాజు, మించల నల్లయ్య, చెంగల్రాయులు వ్యవహ రించారు. శ్రీకాళహస్తి ప్రాంత వీఆర్వోల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని నూతన అధ్యక్షుడు బాలమురళీకృష్ణ తెలిపారు.

మారుతిలో సేవలు బాగున్నాయి

ఆకస్మిక తనిఖీల్లో ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులు స్పష్టం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని లీలా మహల్ కూడలి వద్ద ఉన్న మారుతి హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా రోగులకు అందిస్తున్న వైద్య సేవలు బాగున్నాయని ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులు నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారని హాస్పిటల్ వర్గాలు తెలిపాయి. సోమవారం ఆరోగ్యశ్రీ స్కీమ్ ద్వారా రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరోగ్యశ్రీ ట్రస్ట్ అధికారులు ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్కీం ద్వారా అందుతున్న వైద్య సేవలు, మందులు, భోజన వసతి, ఆసరా గురించి అక్కడున్న రోగులను, రోగుల సహాయకులను అడిగి తెలుసుకున్నారు. మారుతి హాస్పిటల్‌లో ఆర్థోపెటిక్ పాలిట్రామా, న్యూరో సర్జరీ, యూరాలజీ, ప్లాస్టిక్ సర్జరీ, జనరల్ సర్జరీ, పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని మెడికో డాక్టర్ నవీన్ బాబు తెలిపారు. స్కీంలో కొత్తగా చేర్చిన టోటల్ హిప్ రీప్లేస్మెంట్ ఉచితంగా అందిస్తామన్నారు. డాక్టర్ వైయస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఈఓ ఈహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీరామమూర్తి, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. రాజశేఖర్ రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా మేనేజర్ కే. శివకుమార్, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రను జయప్రదం చేద్దాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: డిసెంబర్‌లో ప్రారంభం కానున్న టిడిపి జాతీయ కార్యదర్శి నారా లోకేష్ బాబు పాదయాత్రను జయప్రదం చేయాలని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక ఎన్టీఆర్ భవన్‌లో సోమవారం రాబిన్ శర్మ బృందం, ఆర్టీఎస్ సభ్యులు నియోజకవర్గం స్థాయి వివిధ విభాగాల నేతలతో సమావేశమయ్యారు. 'ఇదేం ఖర్మ' కార్యక్రమాన్ని ఎలా నిర్వహించాలో వారు వివరించారు. వైసీపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను లోతుగా ప్రజల్లోకి తీసుకు పోవాలని వారు కోరారు. మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, మలిశెట్టి వెంకటేశ్వర్లు, గాలి చలపతినాయుడు, రెడ్డివారి గురవా రెడ్డి, విజయ్ కుమ్మార్, గాలి మురళి నాయుడు, కామేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకు ఎమ్మెల్యే బియ్యపు

ప్రజాశక్తి -రేణిగుంట: మండలంలోని తూకివాకం పంచాయతీలో సోమవారం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఆయనకు క్రేన్ ద్వారా భారీ పూలమాల వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం తుకివాకం టిడిపి మాజీ నాయకులు అశోక్ గణపతి ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిజగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ అలాగే ప్రజల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి చీరలు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ సంధ్య, సర్పంచ్ ముని శేఖర్ రెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ ఆనంద్ రావు, మాజీ ఎంపీటీసీ నాగ సుబ్రహ్మణ్యం రెడ్డి, సచివాలయం సిబ్బంది వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **Pagadala Soshwitha D/o Pagadala Latheesh Babu** R/o D.No. 1-112A, Reddy Thota Street Layout, Settipalli village, Tirupathi Urban Mandal, Tirupati Dt. Have changed my name to **PAGADALA SOSHWITHA RAO**